క్లుప్తంగా

ముగిసిన కానాల సుంకులమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

సంజామల: మండల పరిధిలోని కానాల గ్రామంలో వెలసిన సుంకులమ్మ జాతర గురువారం ముగిసింది. కానాలతో పాటు సమీప గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మెక్కుబడులు చెల్లించుకున్నారు. చివరి రోజు కావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

రెండు గడ్డివాముల దగ్ధం

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లెలో పిల్లి మల్లికార్జునకు చెందిన రెండు గడ్డివాములు గురువారం దగ్ధమయ్యాయి. గ్రామస్తులు మంటలను అదుపు చేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పక్క గడ్డివాములకు మంటలు వ్యాపించకుండా ట్యాంకర్లతో నీరుతీసుకొచ్చి అదుపు చేశారు. సుమారు రూ. 50 వేల ఆస్తి నష్టం జరిగిందని రైతులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బిఉప్పలూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శనివారపు పూర్ణచంద్రారెడ్డి(74) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. క్యాన్సర్‌తో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటివద్దే ఉంటున్నాడు. కోలుకోలేక మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, సర్పంచ్ ఈశ్వరయ్య, నాయకులు సత్తిగారి రామిరెడ్డి, రామసుబ్బయ్య తదితరులు గ్రామానికి చేరుకొని పూర్ణచంద్రారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

కోవెలకుంట్ల: స్థానిక గాంధీనగర్‌లో గురువారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కాలనీలో రోడ్డుపై తిరుగుతూ పలువురిపై దాడి చేసింది. కాలనీకి చెందిన నరసింహ, భారతిని విక్షణారహితంగా కరిచింది. బాధితులను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. నాలుగు రోజులుగా పిచ్చికుక్క కాలనీలో స్వైర విహారం చేస్తుందని స్థానికులు వాపోయారు.

కూలీలకు నీటి వసతి కల్పించండి

నంద్యాల(సెంట్రల్): ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి కూలీలకు తాగునీటి వసతి ఏర్పాటు చేయటంలో అలసత్వం వద్దని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి గురువారం ఓ ప్రకటనలో సిబ్బందిని ఆదేశించారు. వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ప్రతి గంటకు ఒకసారి నీరు తాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 6 గంటలకు పనులకు హాజరై 11 గంటల లోపు ముగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. గతేడాది పంపిణీ చేసిన షెడ్లను పని ప్రదేశంలో ఉపయోగించుకోవాలని ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని సూచించారు. వాటర్ బెల్ పద్ధతిని అమలు చేసి కూలీలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శైలం : ఉగాది మహోత్సవాల సందర్భంగా శ్రీశైలం వచ్చిన కన్నడిగుల్లో 8 మంది బుధవారం రాత్రి మల్లమ్మ ఆలయం వద్ద ఉన్న అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతుండగా సీఐ ప్రసాదరావు తన సిబ్బందితో కలిసి దాడి చేసి అరెస్ట్ చేశారు. సీఐ గురువారం మాట్లాడుతూ బాగల్‌కోట్ జిల్లా హిలీకల్ గ్రామానికి చెందిన మల్లేష్ (23), హనుమప్ప (24), గౌడర్ మల్లు (28), హనుగుందా వర్గజన్ గ్రామానికి చెందిన కనిగిర్ అర్జున్ (29), వలికల్ నాగరాజు (21), టి.శరణప్ప (39), గోరేబడు గ్రామానికి చెందిన హనుమంతప్ప బారేకేర్ (28), హలగమని గ్రామస్తుడు ముత్తన్న(23).. మల్లమ్మ కన్నీరు ఆలయం సమీప అటవీ పరిధిలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఏఎస్ఐ గురవయ్య, పోలీసులు రవి, రంగన్న, వెంకటనారాయణ, మహేష్, శివ, బాలకృష్ణ, శంకర్‌రెడ్డితో కలిసి దాడి చేసి అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.21,100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

హెల్త్ ఫౌండేషన్‌ను రద్దు చేయాలి

బొమ్మలసత్రం: యోగా టీచర్లుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మాయ మాటలు చెప్పి పలువురి నుంచి రూ.3లక్షల నుంచి రూ.5లక్షలు వసూలు చేసి ఇప్పటివరకు వారికి జీతాలు కూడా ఇవ్వని బుద్ధ హెల్త్ ఫౌండేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని ఏఐవైఎఫ్ నాయకుడు నాగరాముడు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్థానిక కార్యాలయంలో ఎస్పీని కలిసి మాట్లాడుతూ యోగా ఉపాధ్యాయులుగా మంచి భవిష్యత్ ఉంటుందని పలువురిని నమ్మించి 15 నెలల నుంచి వారితో పని చేయించుకుని జీతాలు ఇవ్వకపోగా, తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తున్న ఫౌండేషను రద్దు చేసి యోగ ఉపాధ్యాయులకు రావలసిన నగదును తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. యోగా ఉద్యోగులు ప్రసాదు, రామకృష్ణారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.



కోవెలకుంట్ల : ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బేతంచెర్ల: రంజాన్ సందేశం వినిపిస్తున్న ఖాజీ నూర్‌అహ్మద్



కొలిమిగుండ్ల: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ప్యాపిలి: దువా చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

కోవెలకుంట్ల: అత్యంత పవిత్రమైన రంజాన్ పండుగ వేడుకలను గురువారం బనగానపల్లె నియోజకవర్గంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజుల కఠోర ఉపవాస దీక్షల అనంతరం బుధవారం రాత్రి నెలవంక దర్శనమివ్వడంతో గ్రామాల్లో పండగ సందడి నెలకొంది. ఈదుల్‌ఫితర్‌ను పురస్కరించుకుని ముస్లిం సోదరులు ఉదయాన్ని కొత్త బట్టలు ధరించి ఆయా గ్రామాల సమీపాల్లో వెలసిన ఈద్గాల వద్దకు వెళ్లి ఫేజ్‌ఇమాం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నమాజ్ చేసుకున్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని 10 మసీదుల నుంచే కాకుండా వివిధ గ్రామాల ముస్లింలు స్థానిక ముదిగేడు రహదారి పక్కన నూతనంగా నిర్మించిన ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు తమ వంతు ఆర్థికసాయం అందజేసి భక్తిభావాన్ని చాటుకున్నారు. ముస్లిం సోదరులు రంజాన్ పండుగ దినాన్ని పురస్కరించుకుని ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ తెలుపుకున్నారు.

బనగానపల్లె రూరల్ : మండల కేంద్రం బనగానపల్లెతోపాటు గ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. బనగానపల్లె పట్టణంలోని ఈద్గాలో ముస్లిం సోదరుల మతగురువు సయ్యద్ అబ్దుల్ హుస్సేని ఖాద్రీ సాహెబ్ (జెండేవాలే సాహెబ్), అలాగే భానుముక్కల ఎస్ఆర్‌బీసీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈద్గాలో మౌలానా షాబుల్లాలు రంజాన్ ప్రముఖ్యతను వివరించారు. నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



బనగానపల్లె: ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

కొలిమిగుండ్ల: రంజాన్ పర్వదినం సందర్భంగా మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు. కొలిమిగుండ్లలో లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఉన్న ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు. మత పెద్దలు రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు.

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్లతోపాటు గ్రామాల్లో గురువారం రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. బేతంచెర్ల పట్టణంలోని ముస్లిం సోదరులు కొలుములపల్లె రహదారిలోని ఈద్గాలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఖాజీ నూర్ అహ్మద్ రంజాన్ పవిత్రతను వివరించారు.

సంజామల: రంజాన్ పండుగ వేడుకలను గురువారం మండల కేంద్రం సంజామలతో పాటు ఆయా గ్రామాల ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సంజామల మర్కాస్ మజీద్ నుంచి ముస్లిం సోదరులు అల్లాహ ప్రవచనాలు ఉచ్చరిస్తూ సామూహికంగా ఈద్గా చేరుకున్నారు. అనంతరం ఫేస్ఇమాం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నమాజ్‌లు చేసుకున్నారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరిని ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్

ప్యాపిలి: మండలంలో ముస్లిం సోదరులు గురువారం ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలో ఉదయాన్నే ముస్లిం సోదరులు ఈద్గాకు చేరుకుని ప్రభుత్వ ఖాజీ హాఫీజ్ మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఈద్ నమాజ్ నిర్వహించారు. హాఫీజ్ రంజాన్ ప్రాశస్త్యాన్ని వివరించారు. పేదలు ఎదుర్కొంటున్న ఆకలిబాధలు తెలుసుకోవాలన్నదే రంజాన్ ఉపవాసాల ఉద్దేశం అని తెలిపారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

డోన్ టౌన్ : మండల కేంద్రం డోన్‌తోపాటు గ్రామాల్లో గురువారం రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణ సమీపంలోని గుత్తి రోడ్డులో ఉన్న ఈద్గా ప్రాంగణం ముస్లిం సోదరులతో నిండిపోయింది. ప్రార్థనల అనంతరం రంజాన్ ప్రాముఖ్యతను ముస్లిం పెద్దలు వివరించారు. తదనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అవుకు: పవిత్ర రంజాన్ పర్వదిన వేడుకలను అవుకు మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణ సమీపంలోని నమాజ్ కొండ వద్ద ఉన్న ఈద్గాకు ముస్లిం సోదరులు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

బనగానపల్లె రూరల్ : రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో రంజాన్ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆయన కుమారుడు ఓబులరెడ్డిని ముస్లిం సోదరులు, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. రంజాన్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ముస్లిం సోదరులు నెల రోజుల పాటు ఎంతో కఠిన ఉపవాసదీక్షలు చేపట్టడంతో పాటు దైవచింతనలో ఎక్కువగా గడపడం జరుగుతుందన్నారు. రమదాన్(రంజాన్)మాసంలో ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ దివి నుంచి భూమి మీదికి వచ్చిన మాసంగా భావిస్తారన్నారు. రంజాన్ మాసంలో పేద, ధనిక తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ మసీదుల్లో నమాజ్ చేయడమే కాకుండా ఇఫ్తార్ విందులో పాల్గొనడం ముస్లిం సోదరుల ఔనత్యానికి నిదర్శనమన్నారు. ప్రజలందరు సుఖసంతో షాలతో ఉండాలని అల్లాను కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ముస్లిం విభాగం కార్యదర్శి అత్తార్ జాహెద్, కూరగాయల మహబూబ్ బాషా మహబూబ్‌వలి తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం సోదరులతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



డోన్‌టౌన్ : ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



అవుకు: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బనగానపల్లె: ప్రసంగిస్తున్న సయ్యద్ అబ్దుల్ హుస్సేనిఖాద్రీ సాహెబ్



డోన్‌టౌన్: రంజాన్ ప్రాముఖ్యతను వివరిస్తున్న పెద్దలు

వైఎస్సార్‌సీపీలో చేరిన బైటిపేట కాలనీవాసులు



మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన బైటిపేట కాలనీవాసులు

బేతంచెర్ల: పట్టణ పరిధిలోని బైటిపేట కాలనీకి చెందిన దాసరి రవి, మద్దిలేటి, దాసరి వెంకటేశ్వర్లు, అనిల్, దాసరి మధు శేఖర్, జగదీష్ గురువారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో వారికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వైఎస్సార్‌సీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో అందరూ ఐక్యంగా ఉండి వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలని మంత్రి బుగ్గన సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దస్తగిరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముప్పతిప్పలు పెడుతున్న కొండముచ్చులు!

- పట్టుకునేందుకు శ్రమిస్తున్న అటవీశాఖ అధికారులు
- అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు సూచన
- శ్రీశైలం వైల్డ్ లైఫ్ రిస్క్ టీం సభ్యులను రప్పించే యత్నం



విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏఈ నాగేశ్వరరెడ్డితో వివరాలు సేకరిస్తున్న అధికారులు

డోన్ టౌన్ : పట్టణ ప్రజలను ఆరు రోజులుగా కొండముచ్చులు ముప్పుతిప్పలు పెడుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు 40 మంది వరకు గాయాలకు గురయ్యారు. పిల్లలు పెద్దలు అనే తేడాలేకుండా దాడి చేస్తున్నాయి. అలా వచ్చి ఇలా కాటేసి వెళ్తున్నాయి. ఎటు నుంచి వస్తాయో... ఎక్కడ కాటేస్తాయోననే జనం బెంబేలెత్తుతున్నారు. గురువారం సైతం ఆరుగురిని గాయపరిచాయి. విద్యుత్‌శాఖ కార్యాలయం సమీపాన, శ్రీనివాసనగర్, తారకరామనగర్, ఇందిరానగర్‌లో ఆరుగురిపై దాడి చేసి గాయపరిచింది కొండముచ్చు. దీంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. కొండముచ్చులు ఐదారు ఉన్నప్పటికీ ఒక్కటి మాత్రమే గాయపరుస్తుందని బాధితులు చెబుతున్నారు. కొండముచ్చులను పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు శ్రమిస్తున్నప్పటికీ ఫలితం దక్కడం లేదు. కోతి కనబడిన వెంటనే 9440810311కు ఫోన్ యాలని అధికారులు సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి...

కొండముచ్చులను పట్టుకునేందుకు ఆటవీ శాఖ అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పట్టణంలోని పలుకాలనీల్లో అటవీశాఖ ఉప అధికారి సూర్యచంద్ర రాజు, డోన్ ఫారెస్టు అధికారి ప్రవీణ్‌కుమార్ తిరుగుతూ బాధితులను పరామర్శించి దాడి వివరాలు తెలుసుకున్నారు. కోతి దాడుల నుండి తప్పించుకునేందుకు ప్రజలకు సూచనలు ఇస్తున్నారు. ప్రజలు అందుబాటులో కర్ర దగ్గర ఉంచుకోవాలని, ఇంటి బయట తినుబండారాలు ఉంచరాదని, పిల్లలు వీధుల్లోకి పంపొద్దని సూచిస్తున్నారు. అదేవిధంగా కోతి వచ్చినప్పుడు గట్టిగా అరవాలని చెబుతున్నారు. మత్తు ఇంజక్షన్‌లు వేసే నిపుణులను(శ్రీశైలం వైల్డ్ లైఫ్ రిస్క్ టీం సభ్యులు) డోన్‌కు రప్పిస్తున్నట్లు సూర్య చంద్ర రాజు తెలిపారు. ఆయన వెంట ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శివశంకర్, సిబ్బంది విష్ణువర్ధన్, కుమార్ తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుని ఆక్రమణల తొలగింపు!

- రహదారి సౌకర్యం ఏర్పడిన తీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నాడు టీడీపీ నాయకుని ఆక్రమణలో ఉన్న పోచా నగర్ - తారకరామనగర్ రహదారి (ఫైల్)



నేడు పోచా నగర్ - తారకరామనగర్ రహదారి

డోన్ : స్థానిక డాక్టర్ పోచానగర్ నుంచి తారకరామనగర్ వెళ్లే ప్రధాన రహదారి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుని ఆక్రమణలో ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మున్సిపల్ ప్రణాళిక విభాగం అధికారులు లేఅవుట్ అప్రూవల్ ఆధారంగా ఇక్కడ రోడ్డు ఉందనే విషయాన్ని గ్రహించి ఆక్రమణలను తొలగించారు. దీంతో దాదాపు ముప్పై ఏళ్లుగా ఈ ప్రాంతం వాసులకు రహదారి సౌకర్యం లేకుండా చేసిన సదరు టీడీపీ నాయకుని తీరును ప్రజలు తీవ్రస్థాయిలో తప్పుపడుతున్నారు. పట్టణంలోని అనేక ప్రాంతాలలో టీడీపీ నాయకుల ఆక్రమణలో ఉన్న పలు రహదారులకు వైఎస్సార్‌సీపీ పాలక వర్గం విముక్తి లభించి అందుబాటులో రావడాన్ని ప్రజలు హర్షిస్తున్నారు.

విప్లవ యోధుడు జ్యోతిరావు పూలే



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: మహాత్మ జ్యోతిరావు పూలే విప్లవ యోధుడని వక్తలు కొనియాడారు. బనగానపల్లె నియోజకవర్గంలో గురువారం పూలే 197 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కులవివక్ష పోరాట సమితి కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, పరంధామ నిలయంలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి, స్థానిక జీవీ కొండారెడ్డి గ్రంథాలయంలో ప్రజా సంఘాల నాయకులు రెడ్డిపల్లె ఓబయ్య, ఓబులేసు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ప్రజా సంఘాల నాయకులు ఓబులేసు, దస్తగిరి, సుధాకర్, శ్రీనివాసులు, వడ్డె సుబ్బరాయుడు, రాముడు, నరసింహ, దేవరాజు, కొమ్ముసుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో గురువారం మహాత్మాజ్యోతి రావ్‌పూలే జయంతిని బీసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజవకవర్గ శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేష్ పూలే సమ సమాజ స్థాపనకు చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు దేవుడు,వెంకటసుబ్బయ్య, నాగేషుడు, సుధాకర్, శ్రీకాంత్, తేజా, సుమంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

డోన్ టౌన్ : మహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతిని గురువారం స్వచ్ఛంధ సంస్థలు, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే త్యాగాలను ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేశారు. పూలే సేవలు చిరస్మరణీయం అన్నారు. ఆయా కార్యక్రమాల్లో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సుబ్బరాయుడు, నరసింహారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మాణిక్యంశెట్టి, ఐఎఫ్‌టీయు జిల్లా అధ్యక్షులు ధర్మారం రంగనాయకులు, డివిజన్ కార్యదర్శి మాధులు, సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ, సమగ్ర వినియోగదారుల రక్షణ సంఘం, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏఈ నాగరాజు పాల్గొన్నారు.

ఆరేళ్లుగా... అన్నం ముట్టలేదు!



ఆసనాలు వేస్తున్న శివన్న

మహానంది: ఆయన వయసు 65ఏళ్లు. ఆరేళ్లుగా అన్నం తీసుకోవడం లేదు. కేవలం మంచినీళ్లు, పండ్ల రసాలు మాత్రమే ఆహారం. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాడి సిదారం గ్రామానికి చెందిన శివన్న నాలుగు ఎకరాల్లో జొన్నలు, గోధుమలు సాగు చేస్తున్నాడు. మహానంది మండలం బుక్కాపురంలోని ఆయన బంధువులైన చాకలి చిన్నోడు ఇంటికి పెళ్లి కార్డులు ఇవ్వడానికి గురువారం వచ్చాడు. ఆయన యోగాసనాలు చేస్తుండటంపై ప్రశ్నించగా పలు విషయాలను వెల్లడించారు. శివన్నకు శివుడంటే ఎంతో భక్తి. తనకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు సంతానం. నిత్యం శివారాధన చేసే శివన్న 12 ఏళ్ల పాటు అన్నం, మాంసాహారం, ఘన పదార్థాలు ముట్టనని దీక్ష తీసుకున్నాడు. అందులో భాగంగానే ఇప్పటికే ఆరేళ్లు గడిచాయి. కేవలం ద్రవ పదార్థాలైన పండ్ల రసాలు, మంచినీరు మాత్రమే తీసుకుంటున్నాడు. ఇప్పటి వరకు తనకు ఎలాంటి అనారోగ్యం తలెత్తలేదని చెప్పాడు. మరో ఆరేళ్ల పాటు అన్నం ముట్టనన్నాడు. నిత్యం యోగాసనాలు చేస్తానని, పొలాల్లో పనులు సొంతంగా చేసుకుంటానని వివరించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

బనగానపల్లె : ప్రతి కుటుంబానికి మేలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ, కూతురు కాటసాని ప్రణితారెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని టంగుటూరులో గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రామిరెడ్డిని గెలిపించాలని కోరతూ వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వనివి కూడా అమలు చేసిన సీఎం జగనన్నకు అండగా నిలువాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన నవరత్నాలు పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ సంక్షేమ పథాలు అమలు చేశారని వారు వివరించారు. చంద్రబాబు 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి అమలు చేయలేదన్నారు. మళ్లీ మోసపు మాటలతో మీ ముందుకు వస్తున్నారని, టీడీపీ నాయకులను నమ్మవద్దన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగసూర్యమద్దిలేటి, ఉపసర్పంచ్ హనుమంతరెడ్డి, ఎంపీపీటి మహనందిరెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్‌కుమార్ రెడ్డి, పెద్దశివారెడ్డి, కానాల నాగేశ్వరరెడ్డి, ఖజుబేగ్, డి హుస్సేన్, గొల్ల బాల సుబ్బరాయుడు, ఈడిగ శేఖర్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరు ఎన్నికల ప్రచారం చేస్తున్న కాటసాని జయమ్మ, కాటసాని ప్రణితారెడ్డి

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని రాఘవరాజుపల్లె-అంకిరెడ్డిపల్లె గ్రామాల మధ్య వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో గురువారం జ్యోతుల మహోత్సవం వైభవంగా జరిగింది. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన తొగటవీర క్షత్రియులు నాలుగు జ్యోతులతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. నృత్యాలు, అమ్మవారి పాటలు పాడుతూ గ్రామోత్సవం నిర్వహించారు. కొలిమిగుండ్ల మండలంలోని పలు గ్రామాలతో పాటు అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జ్యోతులను తిలకించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణరెడ్డి, నాయకులు సత్తిగారి రామిరెడ్డి, రామసుబ్బయ్య, కామిని తిమ్మారెడ్డి, జయరామకృష్ణుడు, సుబ్బయ్య తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు